

పగిలిన 'శ్రీరామిరెడ్డి' పైప్‌లైన్

తెగిన రోడ్డు.. రాకపోకలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-శెట్టూరు

మండల పరిధిలోని కల్యాణదుర్గం వెళ్లే ప్రధాన రహదారిపై చెర్లోపల్లి గ్రామ శివారులో శ్రీరామిరెడ్డి తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో కైరేవు నుంచి చెర్లోపల్లికి వెళ్లే రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి తెగిన రోడ్డును పునరుద్ధరించి రాకపోకలను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పైప్‌లైన్ పగలడంతో ఎగిసి పడుతున్న నీరు

ఆగిపోయింది..!

◆ మొరాయించిన తిరుపతి ప్యాసింజర్ రైలు

◆ ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు



నిలిచిపోయిన రైలు ఇంజన్



రైలు ఇంజిన్‌ను మరమ్మతు చేస్తున్న రైల్వే సిబ్బంది

కదిరిదేవరపల్లి నుంచి రాయదుర్గం మీదుగా తిరుపతికి వెళ్లాల్సిన ప్యాసింజర్ రైలు(07589)ఇంజిన్ మొరాయించింది. శనివారం మధ్యాహ్నం ఈ రైలు కదిరి దేవరపల్లి వద్ద సాంకేతిక సమస్యలతో ఆగిపోయింది. దీనికి మరమ్మతులు చేసేందుకు రైల్వే ఇంజినీర్లు చాలా సేపు కష్టపడ్డారు. అయినా ఫలితం లేకపోయింది. రాయదుర్గం రైల్వేస్టేషన్‌కు సాయంత్రం 3.50 గంటలకు చేరుకోవాల్సిన రైలు సాయంత్రం 6 గంటలైనా చేరుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. నిత్యం ఈ రైలు కోసం కదిరిదేవరపల్లి నుంచి తిరుపతికి వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఆయా స్టేషన్లలో వేచి ఉంచారు. తిరుపతికి వెళ్లేందుకు ఉన్న ఏకైక ప్యాసింజర్ రైలు కావడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అందరూ కూడా ఇందులోనే రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి రైలు ఇంజిన్ మొరాయించడంతో ప్రయాణికులు అందరూ ఇబ్బంది పడ్డారు. ఇంజన్ ఎంత సరిచేసినా మరమ్మతు కాకపోవడంతో రైల్వే ఉన్నాతాధికారులు బళ్లారి నుంచి మరో రైలు ఇంజిన్‌ను కదిరిదేవరపల్లికి తెప్పించే ఏర్పాటు చేశారు. రాత్రి 9-00 గంటలకు బళ్లారి నుంచి ప్రత్యామ్నాయ ఇంజిన్‌తో రైలు బయల్దేరింది. దాదాపు 6 గంటలు ఆలస్యం కావడంతో ఈ రైలు ద్వారా ప్రయాణించాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రజాశక్తి-రాయదుర్గం

కూలిపోయింది..!

◆ కుప్పకూలిన పాఠశాల భవనం

◆ సెలవురోజుకావడంతో తప్పిన ప్రమాదం



కూలిపోయిన పాఠశాల తరగతి గది



రెండు రోజుల క్రితం కూలిన గోడ

శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండల పరిధిలోని బాపనకుంటలో శనివారం నాడు పెనుప్రమాదం తప్పింది. ఈ పాఠశాల భవనం కుప్పకూలి పైకప్పుతో సహా కింద పడిపోయింది. మొహరం సందర్భంగా శనివారం సెలవు రోజుకావడంతో విద్యార్థులు ఎవరూ పాఠశాలలో లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఇందుకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి... నాలుగు రోజుల క్రితం కురిసిన జడివానకు ఈనెల 27న గురువారం ఈ పాఠశాల భవనంకు ఓవైపున ఉన్న గోడ నేల కూలింది. ఆరోజు కూడా విద్యార్థులు వరండాలో కూర్చోవడంతో అప్పుడే ప్రమాదం తప్పింది. కాగ పాఠశాల పూర్తిగా కూలిపోతే గోడలకు గల ఇనుప కిటికీలు, తలుపులు పాడవుతాయన్న ఉద్దేశంతో గ్రామానికి చెందిన కొందరు శనివారం ఉదయం వాటిని తొలగించారు. కిటికీలు, తలుపులు తొలగించడంతో ఒక్కసారిగా పట్టుతప్పి పైకప్పు కూలిపోయింది. కాగా ఈ తరగతి గదిని 1986 అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అప్పటి ఎంపీ ఎస్.రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే సద్దపల్లి వెంకటరెడ్డి దీనిని ప్రారంభించారు. గ్రామస్తులు, పాఠశాల కమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయులు దెబ్బతిన్న ఈ పాఠశాల భవనాన్ని మరమ్మతులు చేయాలని పలుసార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఈ తరగతి గది కూలిపోయింది.

ప్రజాశక్తి-నల్లమాడ

సాగునీటిపై మాటల యుద్ధం

◆ ఏమి చేశారంటూ పరస్పరం విమర్శలు

◆ చంద్రబాబు పర్యటన నేపథ్యంలో వాడీవేడిగా సవాళ్లు

◆ ప్రాజెక్టు పనులు మాత్రం ఎక్కడివేసిన గొంగళి అక్కడే..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాగునీటి ప్రాజెక్టులపై టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆగస్టు ఒకటవ తేదీ నుంచి రాయలసీమ ప్రాజెక్టులపై యాత్ర చేపట్టనున్నారు. ఆగస్టు రెండో తేదిన అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి టిడిపి హయాంలో సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతి తప్ప పనులు జరగలేదని ఆరోపించారు. అదే సమయంలో మాజీ మంత్రి పరిటాల సునీత గురువారం నాడు కాలువ వద్దకెళ్లి సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటున్నారు

ఇద్దరి హయాంలో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్న నేపథ్యంలో వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. పేరూరుకు ఎత్తిపోతల ద్వారా హంద్రీనీవా నుంచి పేరూరు డ్యామ్‌కు నీటిని అందించే పనులను అప్పటి ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబునాయుడు రూ.804 కోట్లతో 2018లో శంకుస్థాపనను చేశారు. దీనికి భూసేకరణ ఏదీ జరగకుండానే పనులను ప్రారంభించారు. 2019 ఎన్నికల నాటికి కూడా ఈ పనులు అనుకున్నంత వేగంగా ముందుకు సాగలేదు. 2019 ఎన్నికల్లో వైసిపి విజయం సాధించాక చెన్నెకొత్తపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణ ఒకసారి శంకుస్థాపన చేశారు. 2024 ఎన్నికల్లోపు మూడు ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఆనాడు ప్రకటించారు. కాని ఇప్పటికీ ఈ ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదు. దీనికి సంబందించి కూడా భూసేకరణ ఇప్పటికీ పూర్తవ లేదు. పనులు ముందుకు సాగలేదు. రాయదుర్గం నియోజకవర్గంలోని భైరవానితిప్ప ప్రాజెక్టు పరిస్థితి ఇదే రకంగా ఉంది. భూసేకరణకు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇటీవల జిల్లాకు వచ్చిన సందర్భంలో నిధులు విడుదల చేయడంతో నిర్వాసితుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నారు. కాని ఇక్కడ కూడా ప్రాజెక్టు పనులు మాత్రం ప్రారంభమవలేదు.



రామగిరి మండలం దుబ్బార్లపల్లి వద్ద ఆగిన జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు జలాశయంకు నీరందించే కాలువను చూపుతునన్న మాజీ మంత్రి పరిటాల సునీత

ఇద్దరి హయాంలోనూ అదే పరిస్థితి..

టిడిపి, వైసిపి ఇద్దరి హయాంలో ప్రాజెక్టు పనులు ఎక్కడివక్కడే ఆగి ఉన్నాయి. హంద్రీనీవా వెడల్పు పనులు అదే పరిస్థితి నెలకొంది. టిడిపి హయంలో కాలువ వెడల్పు 3800 ప్రవాహ సామర్థ్యం పెంచుతామని పనులు ప్రారంభించారు. అయితే వారి హయాంలో పూర్తవలేదు. వైసిపి అధికారంలోకి వచ్చాక దీని సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించి టెండర్లు సైతం పిలిచారు. కాని పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. పనులు పూర్తికాకపోవడం వలన గడిచిన మూడేళ్లుగా నీళ్లు పుష్కలంగా ఉన్నా నీటిని పూర్తి స్థాయిలో జిల్లాకు తీసుకురాలేకపోయారు. 25 టిఎంసిల్లోపే నీటిని తీసుకోగలిగారు.

31న కడప ఉక్కుకై కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



కలెక్టరేట్ వద్ద ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

విభజన హామీల్లో భాగంగా కడపలో ఏర్పాటు చేస్తామన్న ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. శనివారం స్థానిక గణేనాయక్ భవనంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప, బాలరంగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.రాంభూపాల్ మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాట చేస్తామన్న హామీని బిజెపి తుంగలోకి తొక్కిందన్నారు. పార్లమెంటులో ఇటీవల చేసిన ప్రకటనతో ఈ విషయం స్పష్టమైందన్నారు. సెయిల్ ద్వారా అధ్యయనం చేస్తున్నామని ఇంతకాలం ప్రకటించిన కేంద్రం ఇప్పుడు చేతులెత్తేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు పరిశ్రమ ఇక్కడ అనువు కాదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం రంగ సంస్థకే సాధ్యం కానప్పుడు ప్రయివేటు సంస్థ ఇక్కడ ఏరకంగా ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయబడానికి ముందుకొచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు సంబంధించి నాలుగుసార్లు శంకుస్థాపనలు జరిగాయని గుర్తు చేశారు. కాంగ్రెసు ప్రభుత్వ హయంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఒకసారి శంకుస్థాపన చేయగా, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా ఒకసారి చేసారన్నారు. తాజాగా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రెండుసార్లు శంకుస్థాపనలు చేసారని గుర్తు చేశారు. ఇది కేవలం శంకుస్థాపనలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఇంత జరుగుతున్నా అధికార వైసిపి నోరు మెదపటం లేదని విమర్శించారు. పైగా ఆ పార్టీకి అవసరమైన మద్దతును అందిస్తూనే ఉందని తెలిపారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వక పోయినా, ప్రత్యేక హోదా లేకపోయినా, విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేస్తున్నా ఇలా అన్ని రకాలుగా రాష్ట్రానికి నష్టం చేకూరుస్తున్నా పల్లెత్తు మాట కేంద్రంలోని బిజెపిని వైసిపి ప్రభుత్వం అనకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన పార్టీల పరిస్థితి ఇదే రకంగా ఉందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీల వైఖరిని ప్రశ్నిస్తూ ఈనెల 31వ తేదీన కడప ఉక్కు పరిశ్రమకై పోరాటాన్ని చేపట్టాలని సిపిఎం పిలుపునిస్తోందని చెప్పారు. అందులో భాగంగా 31వ తేదీన అనంతపురం కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసనలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కేంద్రం వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు.



జనవాహిణి మధ్య అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న స్వామివారు

కన్నుల పండువగా కుళ్లాయిస్వామి అగ్నిగుండ ప్రవేశం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అగ్నిగుండ ప్రవేశం కన్నుల పండువగా సాగింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున మూడు గంటల నుంచి పురవీధుల గుండా స్వామివారిని ఊరేగించారు. ఉదయం 6.30 గంటల సమయంలో భక్తుల జనసందోహం మధ్య స్వామివారు అగ్నిగుండ ప్రవేశం చేశారు. స్వామివారి అగ్నిగుండ ప్రవేశ సమయంలో కుళ్లాయిస్వామి గోవిందా.. అంటూ భక్తుల నినాదాలతో గూగూడు దద్దరిల్లింది. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం కుళ్లాయిస్వామి జలదికి తరలించారు. కాగా సోమవారం రాత్రి కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ముల్లాసాబ్ హుస్సేనప్ప, ఆలయ కార్యనిర్వహణాధికారిణి శోభ తెలిపారు. కాగా భారీగా కందూరీలు (జంతు బలి) చేసి మొక్కులు తీర్చుకున్నారు.

తాడిపత్రిలో టిడిపి కౌన్సిలర్ రాజీనామా

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి ఆరో వార్డు టిడిపి కౌన్సిలర్ బూర్గుల రాబర్ట్ శనివారం తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని మీడియాకు విడుదల చేశారు. రాజీనామాకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగ గత కొంతకాలంగా రాబర్ట్ పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఏది ఏమైనప్పటికిని టిడిపి కౌన్సిలర్ రాబర్ట్ ఆ పార్టీకి రాజీనామా చేయడంతో తెలుగుదేశం వర్గాలలో ఒకింత సంచలనం రేకెత్తినట్లయింది. త్వరలో తన నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

బిఇఎల్ ఛైర్మన్‌ను కలిసిన మెట్టు గోవిందరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం



బిఇఎల్ ఛైర్మన్ శ్రీవాత్సవతో మెట్టు గోవిందరెడ్డి

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) బెంగళూరులో శనివారం ఏర్పాటు చేసిన విందులో ఏపీఐఐసీ ఛైర్మన్ మెట్టు గోవింద రెడ్డి పాల్గొన్నారు. బీఈఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భాను పి.శ్రీవాత్సవతో ఆయన మాట్లాడారు. వైఎస్.జగన్మోహన్ రెడ్డి నేతత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా శరవేగంగా అడుగులు ముందుకు వేస్తోందన్నారు. ఓ వైపు పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, మరో వైపు సెజ్ (స్పెషల్ ఎకనామిక్ జోన్)లు, వాటిలో భారీ పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లా పాలసముద్రం వద్ద 914 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగానికి చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్ పనులు వేగం జరుగుతున్నాయని చెప్పారు. ఐదు దశల్లో ఈ యూనిట్‌ను అభివద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే తొలి దశలో రూ.384 కోట్లతో అభివద్ధికి బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. ఆగస్టు నెలలో పాలసముద్రంలో బీఈఎల్ సందర్శించి పనులను మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ వేగంగా కొనసాగుతుందన్నారు. అక్టోబర్ నెలలో పనులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో బీఈఎల్ డైరెక్టర్లు పార్థసారథి, వినయ్ కుమార్, మనోజ్ జైన్, దామోదర్, విక్రమాన్, కెవి.సురేష్ కుమార్, శివనాద్ యాదవ్, సంతోష్ కుమార్, శ్యామ సింగ్, ప్రఫుల్ల కుమార్ చౌదరి పాల్గొన్నారు.

సమస్యల వలయంలో 'జిందాల్' కార్మికులు

పని గంటలు పెంచినా..వేతనం మాత్రం అంతే..

సెలవుల్లోనూ కోతలే.. ఆందోళనలో శ్రామికులు



జిందాల్ కార్మికులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని హరేసముద్రం వద్ద ఉన్న జిందాల్ కర్మాగారంలో పని చేస్తున్న కార్మికులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యంగా రోజుకు 12 గంటల పని విధానం అమలు చేయడం పట్ల కార్మికులు మండిపడుతున్నారు. కార్మికులు మాట్లాడుతూ కార్మిక చట్టం ప్రకారం ప్రతి కర్మాగారంలో 8 గంటలు పని చేయించుకోవాలని, పని గంటలు పెంచితే చట్టపరంగా నేరం అన్నారు. గతంలో శాతవాహన ఇస్పాత్ పేరుతో నిర్వహించిన సమయంలో 8 గంటలు చొప్పున మూడు షిఫ్ట్‌ల్లో కార్మికులు పని చేసే వారన్నారు. శాతవాహన కర్మాగారం ప్రస్తుతం జిందాల్ కర్మాగారంగా పేరు మార్చి కార్మికులకు పని గంటలు పెంచారే కానీ వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిందాల్ కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులకు సాధారణ సెలవులు, మెడికల్ సెలవులతో పాటు ప్రతినెలా వేతనాలు, ఇంక్రిమెంట్లు సకాలంలో ఇవ్వడం లేదని వాపోయారు. కాంట్రాక్టర్ కింద పని చేసే కార్మికులకు ప్రతి నెలా 25వ తేదీ పైన వేతనాలు ఇస్తున్నారని, దీంతో కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. యూనిఫారం, బూట్లు, హెల్మెట్, గ్లవ్‌లు అందించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. కర్మాగారాలను తనిఖీ చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో కార్మికుల కష్టాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. కార్మికులు నివాసముండే గృహాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో చిమ్మ చీకట్లో నివాసం ఉంటున్నామని, తాగునీరు అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా యాజమాన్యం స్పందించి కంపెనీ, కాంట్రాక్ట్ ఉద్యోగులకు 8 గంటల పని విధానం కల్పించడంతో పాటు ప్రతి నెలా త్వరగా వేతనాలు ఖాతాల్లో జమ చేయాలని, అవసరమైన పనిముట్లు అందించాలని కార్మికులు కోరుతున్నారు.

నీళ్లు కాదు..నిధులు పారించారు..

ఏ మోహం పెట్టుకుని జిల్లాకు వస్తారు.?

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో ప్రాజెక్టులను నిర్మిస్తామన్న పేరుతో నీల్లు కాదు.. నిధులు పారించారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి టిడిపి నేతలను ఉద్దేశించి ఆరోపించారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై చేపట్టిన యాత్రపై ఆయన స్పందించారు. వారు అధికారంలోనున్న కాలంలో సాగునీటి ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రూ.60 వేల కోట్లతో ప్రాజెక్టులు చేపడుతున్నామన్న పేరుతో డబ్బులు దండుకున్నారని విమర్శించారు. వారు సరైన పద్ధతిలో నిధులు ఖర్చు చేసి ఉంటే ఈపాటికి ప్రాజెక్టులన్నీ పూర్తయ్యి రాయలసీమ సస్యశ్యామలం అయ్యేదని చెప్పారు. బిటిపి ప్రాజెక్టు కింద భూసేకరణకు నిధులిచ్చింది తమ ప్రభుత్వమని చెప్పారు. ఏ మోహం పెట్టుకుని ఈ ప్రాంతానికి వస్తున్నారని చంద్రబాబును ఉద్దేశించి విమర్శించారు. వారి ఐదేళ్ల కాలంలో దోచుకోవడం తప్ప ప్రాజెక్టులు చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రకృతి కరుణించి జిల్లాలో వర్షాలు బాగా వచ్చి ఎక్కడ చూసినా పచ్చదనం ఉందన్నారు. మీరొస్తే మరోమారు క్షామం తప్పదని ఎద్దేవా చేశారు.

మాదిగ మహాశక్తి మండల కమిటీ ఎన్నిక

ఉరవకొండ : మాదిగ మహాశక్తి ఉరవకొండ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు కేపీ నారాయణస్వామి తెలిపారు. శనివారం ఉరవకొండలోని ఆర్అండ్‌బి బంగ్లా ప్రాంగణంలో మండల అధ్యక్షునిగా ఎం.ధనుంజయ, కార్యదర్శిగా సాకే సురేంద్రను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీహెచ్‌పీఎస్ వ్యవస్థాపకులు జయరాములు, ఆలిండియా ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె రవీందర్, జీవీఎస్ఎస్ పురుషోత్తం, ఎంఆర్‌సిఎస్ పృథ్వీరాజ్, ఎమ్మార్పీఎస్ మల్లికార్జున, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక అధ్యక్షులు రాజశేఖర్, డివిజినల్ అధ్యక్షులు రాము, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పెన్నయ్య, కార్యదర్శి రామాంజనేయులు చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగపై సన్నగిల్లుతున్న ఆసక్తి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



అనంతపురం జిల్లా అంటేనే గుర్తుకొచ్చేది కరువు. జైసల్మీర్ తర్వాత అత్యల్ప వర్షపాతం కలిగిన ఈ ప్రాంతంలో విస్తారమైన భూభాగముంది. 23 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఇంతటి భూ భాగానికి పది శాతం కూడా సాగు నీటి వసతి లేదు. ఒకవైపు వర్షాభావం.. మరోవైపు సాగునీటి వసతి లేని ప్రాంతంలో కావడంతో 'వ్యవసాయం ఒక జూదం'గా మారింది. ఈ వాతావరణానికి తగ్గట్టు పండే పంటలు పెద్దగా లేవు. తక్కువ నీటితో పండే పంటల్లో వేరుశనగ ప్రధానంగా చెప్పవచ్చు. కొంత వాణిజ్య పంటగానూ ఉండటమే కాకుండా పశుగ్రాసం ఉండే దొరికే వీలుండటంతో నాలుగు దశాబ్దాలుగా రైతులు వేరుశనగ పంట వైపు మొగ్గు చూపుతూ వచ్చారు. విత్తనం విత్తినప్పటి నుంచి నూర్పిడి వరకూ కనీసం మూడు వర్షాలు వచ్చినా పంట చేతికి వస్తుందన్న ఆశతో రైతులు దీనిపై మొగ్గు చూపుతూ వచ్చారు. ఇందుకు తగ్గట్టుగా ప్రభుత్వాల ప్రభావంతో సబ్సిడీలిస్తూ రావడంతో ఈ పంట సాగు విస్తీర్ణంలో అనతికాలంలోనే పెరుగుతూ సాగుభూమిలో 80 శాతం వేరుశనగ పంటయే సాగవుతూ వచ్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 18 లక్షల ఎకరాల్లో వేరుశనగ ఒకప్పుడు సాగయ్యేది. రాష్ట్రంలోనే అత్యధికంగా వేరుశనగ పంట పండే ప్రాంతంగానూ ఉంది. అయితే వరుస ప్రకృతి వైపరీత్యాలు, తగ్గుతున్న ప్రభుత్వ తోడ్పాటుల కారణంగా వేరుశనగ సాగు గడిచిన దశబ్దకాలంగా తగ్గుతూ వస్తోంది. ఇప్పుడు సాధారణ సాగు 12 లక్షల ఎకరాలకు పడిపోయింది. ఈ ఏడాది మరింతగా తగ్గే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎందుకంటే వేరుశనగ విత్తనం విత్తుకునేందుకు జూన్ నుంచి జులై 15లోపు అనువైన సమయం. ఆ సమయంలో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రస్తుతం రెండు జిల్లాల పరిధిలో కలిపి 1.50 లక్షల ఎకరాల్లోపే విత్తనం పడింది. సీజన్ మగుస్తున్న ఈ తరుణంలో ఇప్పుడు వర్షాలు పడ్డాయి. అయితే పదును అయిన ప్రాంతాలు తక్కువనే చెప్పాలి. అదును దాటక పడటంతో వేరుశనగ సాగు విస్తీర్ణం ఏ మేరకు పెరుగుతుందన్నది సందేహాస్పదంగానే ఉంది. ఒకవేళ పెరిగినా పూర్తిస్థాయి పెరిగే అవకాశాలు కనిపించడం లేదు. ఎందుకంటే విత్తనం కొనుగోలు సమయంలోనే రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఒకప్పుడు జిల్లాలో ఐదు లక్షల క్వింటాళ్ల విత్తనం పంపిణీ చేసినా తక్కువ వచ్చేవి. అలాంటిది ఈసారి ఒకటిన్నర లక్షల క్వింటాళ్ల సబ్సిడీతో ప్రభుత్వమిచ్చినా కొనేందుకు రైతులు ముందుకు రాలేదు. విత్తనం కొనేందుకే ముందుకు రాకపోతే సాగు ఏ మేరకవుతుందన్నది ప్రశ్నార్థకంగానే ఉందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. ఏదిఏమైనా జిల్లాలో వేరుశనగ సాగు క్రమంగా తగ్గుతూ వస్తోందని వ్యవసాయ నిపుణులు సైతం చెబుతున్నారు. అదే సమయంలో సాగు విస్తీర్ణం కూడా ఏటా తగ్గుతూ రావడం గమనార్హం. ప్రస్తుతం 16 లక్షల ఎకరాల్లోపే సాగు ఉంటోంది. ప్రధానంగా వర్షాధారం కింద పంటల సాగు గణనీయంగా పడిపోతోంది. గడిచిన నాలుగైదేళ్ల జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు పడుతున్నా సాగు విస్తీర్ణం మాత్రం తగ్గుతూ వస్తుండటం కొంత ఆందోళన కలిగించే అంశమే. ఇదే తీరు టమోటా సాగులోనూ కనిపిస్తోంది. ఏటా 45 వేల ఎకరాల్లో సాగయ్యే టమోటా పంట ఈసారి పది వేల ఎకరాల్లోపే ఆగిపోయింది. ఫలితంగా టమోటా ధరలు ఆకాశాన్ని అంటుతున్న విషయం తెలిసిందే. ఇక వేరుశనగ సాగు ఇదే పద్ధతిలో పడిపోతే నూనె ధరలు ఏ రకంగా ఉంటాయన్నది నిపుణులు చెబుతున్నారు. ఏది ఏమైనా అనంతపురం జిల్లా నుంచి క్రమంగా వేరుశనగ బందం తగ్గిపోతున్నట్టు కనిపిస్తోంది.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. యాడికికి చెందిన భార్యాభర్తలు మహబూబ్‌బాషా, రహమత్‌బీ నంద్యాల జిల్లా ప్యాపిలిలో ఉన్న బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అయితే జక్కలచెరువు వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి జాతీయ రహదారిపై బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన దంపతులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం రహమత్‌బీ అనంతపురం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

లారీని ఢీకొని వ్యక్తికి..

మండలంలోని ఇసురాళ్లపల్లి బస్టాప్ వద్ద శనివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దవడుగూరు మండలం ఎ.తిమ్మాపురం గ్రామానికి చెందిన పవన్ ద్విచక్ర వాహనంలో వస్తూ ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అదనపు చికిత్స కోసం క్షతగాత్రున్ని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కిడ్నాప్ కలకలం

అనంతపురం క్రైం : నగరంలో జరిగిన ఓ కిడ్నాప్ శనివారం కలకలం సృష్టించింది. త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్ తెలిపిన వివరాల మేరకు.. కర్నాటక రాష్ట్రం రాయచూరు తాలూకా అలకూరుకు చెందిన కొందరు వ్యక్తులు స్థానిక బళ్లారి బైపాస్‌లోని ఓ లాడ్జిలో బసచేశారు. వారిలో లలీంద్ర అనే వ్యక్తి టీ తాగేందుకు బయటకు రాగానే కారులో వచ్చిన కొందరు వ్యక్తులు బలవంతంగా ఎక్కించుకుని వెళ్లారు. గమనించిన స్థానికులు బసచేసిన వారికి చెప్పడంతో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా అలకూరు గ్రామంలో జరిగిన సర్పంచు ఎన్నికల్లో ఇరువర్గాల వారికీ సమానంగా వార్డు సభ్యులు గెలవడంతో ఒక వర్గం వారు అనంతపురంలో క్యాంపు ఏర్పాటు చేసుకున్నారు. తమ వ్యతిరేక వర్గం వారే వార్డు మెంబరైన లలీంద్రను కిడ్నాప్ చేశారన్న అనుమానంతో వారి సహచరుడు తిమ్మప్పనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


తోపుడు బండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సిఐ

పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఫుట్‌పాత్‌ను ఆక్రమించి పాదచారులతోపాటు ట్రాఫిక్‌కి ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్, టూటౌన్ సీఐలు వెంకటేష్‌నాయక్, శివరాముడు హెచ్చరించారు. శనివారం నగరంలోని సుభాష్‌రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఉన్న తోపుడు బండ్లు, చిన్న చిన్న చెక్క బల్లలపై వ్యాపారాలు చేసే వారిని ఖాళీ చేయించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన కారణంగా పాదచారులతో పాటు ట్రాఫిక్ కి తీవ్రఅంతరాయం కలుగుతోందని ఫిర్యాదులు రావడంతో చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

రంజిత్‌నాయక్ వర్ధంతిని జయప్రదం చేయాలి

బిజిఎస్ వ్యవస్థాపకు ఎస్‌కె.మహేష్ బంజారా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సేవాఘడ్ ట్రస్టు వ్యవస్థాపకులు పూజారి రంజిత్‌నాయక్ వర్ధంతి కార్యక్రమానికి బంజారాలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని బంజారా గిరిజన సమాఖ్య జాతీయ వ్యవస్థాపకులు ఎస్‌కె.మహేష్ బంజారా, సేవాఘడ్ ట్రస్టు సాంస్కృతిక విభాగం కార్యదర్శి ఎస్‌కె.రామచంద్రనాయక్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బిజిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా, నాగినాయిని చెరువు తండా విద్యాదాత పూజారి చాంప్లా నాయక్ ద్వితీయ పుత్రుడు పూజారి రంజిత్‌నాయక్ నేషనల్ ఆర్కిటెక్స్‌లో ప్రముఖ స్థానాన్ని పొందారన్నారు. అంతేగాకుండా ప్రజాసేవకు అంకితమై బంజారాలకు సేవలందించిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. బంజారా సేవారత్న వంటి అనేక బిరుదులు పొందిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రంజిత్‌నాయక్ జిల్లా వాసి అయినప్పటికీ జీవనం రీత్యా ముంబయిలో స్థిరపడ్డారని వివరించారు. బంజారాల స్థితిగతులను గ్రహించి మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి యుపి.నాయక్ వంటి వారితో పాటు ఇతర సేవాతత్పరులతో కలిసి బంజారా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఎబిఎస్ఎస్ వ్యవస్థాపకుల్లో ఒకరిగా ఉండి దేశవ్యాప్తంగా బంజారాలను ఏకతాటిపై తీసుకొచ్చి చైతన్యం కల్పించడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. నాస్థికుడైన రంజిత్‌నాయక్ కులదైవమైన శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ప్రతిమను సేకరించి గుత్తి సేవాఘడ్‌లో ఆలయం నిర్మించి ప్రపంచ ప్రఖ్యాత సేవాఘడ్ ట్రస్టు నెలకొల్పాడని తెలిపారు. రాళ్లు, చెట్లను పూజించే బంజారాలకు తమ ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ ప్రతిమను వెలుగులోకి తీసుకొచ్చి దైవచింతన వైపు బంజారాలను నడిపించారని తెలిపారు. బంజారాల్లో ఉన్నతాధికారులుగా పనిచేసిన వారు రంజిత్‌నాయక్‌కు సహకరించడంతో 2000 సంవత్సరంలో దేశ నలుమూలల నుంచి ప్రముఖులు, బంజారాల నడుమ సేవాఘడ్ ట్రస్టును ప్రారంభించారని తెలిపారు. అలాంటి వ్యక్తిని స్మరించుకోవడంలో భాగంగా వర్ధంతి కార్యక్రమాన్ని సేవాఘడ్‌లో ఆదివారం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సేవాఘడ్ ట్రస్టు అధ్యక్షులు కొర్రా జగన్నాధరావు, ఉపాధ్యక్షులు ఎస్‌కె.కేశవనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిఎల్.రవీంద్రానాయక్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. కావున బంజారాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న బిజిఎస్ వ్యవస్థాపకు ఎస్‌కె.మహేష్ బంజారా

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు

ఐఎఫ్‌టియు జాతీయ ఉపాధ్యక్షులు పి.ప్రసాద్

ప్రజాశక్తి-గుంతకల్లు

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐఎఫ్‌టియు జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్ పిలుపు నిచ్చారు. శనివారం పట్టణంలోని గాయత్రీ ఫంక్షన్ హాల్‌లో ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, జె.వెంకటేశ్వర్లు, ఆర్.హరికృష్ణ అధ్యక్షతన రాష్ట్ర వర్క్‌షాప్, రాజకీయ శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రాదేశిక సూత్రాల్లో పేర్కొన్న యూనిఫాం సివిల్ కోడ్ అనే అంశాన్ని మోడీ, షాల ప్రభుత్వం ముందుకు తేవటం ద్వారా చాలా ప్రమాదకరమైన పరిస్థితులు ముంచుకొస్తున్నాయన్నారు. ముఖ్యంగా మణిపూర్‌లో మైతేయి తెగను రెచ్చగొట్టి కుకీ, నాగా తెగలపై దాడులు చేయిస్తూ మత కల్లోలాన్ని సృష్టించడమే కాకుండా స్త్రీలను నగ్నంగా ఊరేగించే స్థాయికి చేరిన విధానాలకు కేంద్రంతోపాటు ఆ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. అలాగే కార్మిక వర్గంపై లేబర్ కోడ్స్ పేరుతో జరగబోతున్న దాడిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పొలారి రాష్ట్ర కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా సభ్యులు చర్చించి ఆమోదించారు. ఈ ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ సభ్యులు బి.సురేష్, ఎం.ఏసు, స్థానిక నాయకులు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు జాతీయ ఉపాధ్యక్షులు పి.ప్రసాద్


ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి-అనంతపురం

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం ఎటిపి-7 బ్రాంచ్‌లో ప్రిన్సిపల్ పర్వీన్ ఆధ్వర్యంలో హరితహార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రధాన కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి జీవనాధారమైన చెట్లను రక్షించుకోకపోతే మానవ మనుగడ కష్టతరమవుతుందన్నారు. కావను ప్రతి ఒక్కరూ ఒక్కొక్క చెట్టు నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం విద్యార్థులు వేసిన వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పర్వీన్, డీన్ చంద్రమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాల ప్యాకెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి

'అమ్మ' డెయిరీ పాల నాణ్యతను చూడండి

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

10 వేలమంది పాడి మహిళా రైతుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మ డెయిరీ పాల నాణ్యతను ప్రజలు ఒకసారి చూడాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక పాపంపేట, కక్కలపల్లి కాలనీ పంచాయతీలతోపాటు చిన్మయనగర్‌లో మహిళలు, వైసిపి నాయకులు కలిసి శనివారం ఇంటింటికీ వెళ్లి పాల ప్యాకెట్లను సరఫరా చేశారు. నేడు అనంతపురం రూరల్‌లో శాంపిల్ పాకెట్లు అందజేస్తారని వివరించారు. పది రోజుల్లో లక్ష ఇళ్లకు శాంపిల్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మండల కన్వీనర్లు, ఎంపిపి, జెడ్పీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహారం వేడుకలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మొహరం వేడుకల్లో భాగంగా మండల కేంద్రంతోపాటు యాలేరు, తలపూరు గ్రామాల్లో పీర్ల స్వాముల అగ్నిగుండ ప్రవేశం కన్నుల పండువగా సాగింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున పురవీధుల గుండా సర్దార్‌నప్ప మెరవని సాగింది. సాయంత్రం అగ్నిగుండం అనంతరం జల్దికి తరలించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ, కుల పెద్దలు పాల్గొన్నారు.

పుట్లూరు : మొహరం వేడుకల్లో భాగంగా శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో పెద్ద సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా నాయకునిపల్లి, నారాయణరెడ్డిపల్లి, ఎల్లుట్ల, మడ్డిపల్లి, తదితర గ్రామాల్లో పీర్లస్వాములను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. అనంతరం స్వాములను పురవీధుల గుండా ఊరేగించారు. ఆదివారం ఉదయాన్నే అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

శింగనమల : మొహ్రరం వేడుకల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా మమ్మదినప్ప స్వామిని ప్రత్యేకంగా అలంకరించి చక్కెర చదివింపులు, ప్రత్యేకమైన ప్రార్థన చేశారు. శనివారం తెల్లవారుజామున పురవీధుల గుండా ఊరేగించారు. ఆదివారం సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం అనంతరం జల్లికి తరలించనున్నారు.

పెద్దపప్పూరు : మొహరం వేడుకల్లో భాగంగా మండలం పరిధిలోని వెంగంపేట గ్రామంలో శనివారం జలది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పీర్లను గ్రామమంతా మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగించారు. అనంతరం జలదికి తరలించారు.

గార్లదిన్నె : మొహరం వేడుకల్లో భాగంగా మండలంలోని గార్లదిన్నె, కోటంక, పెనకచర్ల, కల్లూరు గ్రామాల్లో శనివారం పెద్ద సరిగెత్తు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా పీర్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని అక్కన్న పల్లి గ్రామంలో నిర్వహించిన మొహరం వేడుకల్లో ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలంతా సోదర భావం కలిగి ఉంది మొహరం వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గన్నెవారిపల్లి ఎంపిటిసి సగర రవికుమార్, వైసిపి నాయకులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, బాబూజినాయుడు, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో జలదికి తరలుతున్న పీర్లు


మొహరం ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

అంజలి మృతికి సంతాపం

రాయదుర్గం : రాయదుర్గం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బండి కృష్ణమూర్తి సతీమణి అంజలి (51) మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యం కారణంగా అంజలి మృతిచెందినట్లు తెలుసుకున్న విప్ కాపు రామచంద్రారెడ్డి సతీమణి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, విజయలక్ష్మి దంపతులు, వాల్మీకి సంఘం తాలూకా అధ్యక్షులు బండి క్రిష్టప్ప మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మున్సిపల్ వార్డు సభ్యులు, పుర ప్రముఖులు, తదితరులు భౌతిక కాయానిని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చీనీ రైతుకు నష్టపరిహారం చెల్లించాలి

గార్లదిన్నె : మండల పరిధిలోని కొట్టాలపల్లిలో విద్యుత్ లైన్ కింద పడి దాదాపు 400 చీనీ చెట్లు కాలిపోయిన రైతు ఆదిశేషయ్యకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సిపిఐ, రైతుసంఘం నాయకులు కాలిపోయిన చీనీచెట్లను పరిశీలించి బాధిత రైతులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శి రాము, సిపిఐ నాయకులు శర్మస్‌వలి, వన్నూర్‌వలి, నాగేంద్ర, రైతు ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

31న డెంగీ నివారణ మాసోత్సవాల మెగా ర్యాలీ

ఉరవకొండ : ఈనెల 31వ తేదీన సోమవారం విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరులో డెంగీ నివారణ మాసోత్సవాలపై 1116 మందితో మెగార్యాలీ నిర్వహించనున్నట్లు ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌కు ప్రింటర్ అందజేత

యాడికి : పెద్దపేటకు చెందిన తోరెడ్డి రామిరెడ్డి జ్ఞాపకార్థం మనువడు రాజారెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ప్రింటర్, జిరాక్స్ మిషన్‌ను అందజేశారు. ఇందుకు ఎస్ఐ అంబటి గురుప్రసాద్‌రెడ్డి రాజారెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజారెడ్డి స్నేహితులు గుండా నారాయణస్వామి, విశ్వనాథ్, కృష్ణమూర్తిచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ధరమ్‌స్వరూప్ నకారాకు నివాళి

అనంతపురం కలెక్టరేట్ : పెన్షన్ పితామహుడు ధరమ్ స్వరూప్ నకారా వర్ధంతిని పురస్కరించుకుని శనివారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధరమ్ స్వరూప్ చేసిన పోరాట ఫలితమే నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సకాలంలో పెన్షన్ పొందుతున్నారని తెలిపారు. అలాంటి గొప్ప వ్యక్తిని స్మరించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.ప్రభాకర్, కోశాధికారి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులు యు.చంద్రశేఖర్‌రెడ్డి, కె.వేణుగోపాల్, ఈసీ మెంబర్ కె.సత్యనారాయణ, అనంతయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి పరిశోధన, సమాచార కమిటీలో ఆదెన్నకు చోటు

శింగనమల : టిడిపి అత్యుత్తమైన పరిశోధన, సమాచార కమిటీలో జిల్లాలోని కాపు సామాజిక వర్గానికి చెందిన గాజుల ఆదెన్నకు చోటు కల్పించడం హర్షించదగ్గ విషయమని టిడిపి అధికార ప్రతిని దేగల కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో అన్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి కాపులకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్ర పార్టీ కార్యనిర్వా కార్యదర్శిగా పని చేస్తున్న గాజుల ఆదెన్నకు కమిటీలో చోటు కల్పించారన్నారు. ఇందుకు అధినేత చంద్రబాబు, యువనేత నారాలోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వృద్ధాశ్రమానికి వంటపాత్రలు వితరణ

ఉరవకొండ : ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులు జాకీర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని విఠల్ రుక్మిణీ వృద్ధాశ్రమానికి వంట సామగ్రి వితరణ చేసినట్లు ట్రస్టు వ్యవస్థాపకులు వేల్పుల మురళి తెలిపారు. మొహరం పండుగను సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుల సూచన మేరకు పాత్రలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు ఎర్రిస్వామి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి

ఉరవకొండ : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలో ఓటరు జాబితా సవరణపై నాయకులు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సూచించారు. శనివారం అనంతపురంలోని వైసిపి కార్యాలయంలో ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించిన ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల వెరిఫికేషన్ సందర్భంగా టిడిపి నాయకులు దొంగఓట్లను తొలగించకుండా బిఎల్ఓలను బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. కావున నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, కమ్మ, కురుబ, వాల్మీకి కార్పొరేషన్ల డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, దుద్దేకుంట రామాంజనేయులు, ఉరవకొండ జెడ్పిటిసి పార్వతమ్మ, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ సుశీలమ్మ, బెలుగుప్ప ఎంపిపి పెద్దన్న, మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు కరణం భీమరెడ్డి, వెంకటరెడ్డి, రాచనగౌడ్, వసికెరి రమేష్, సోమశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి